Truth of News
RNI NO : APTEL/25/A0239
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్
IRS PUBLICATIONS
irspublications12@gmail.com
సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 269 | సోమవారం 13 ఏప్రిల్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50
Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## ప్రముఖ గాయని ఆశాభోస్లే (92) కన్నుమూత

- ముంబై బ్రీచ్‌క్యాండీఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి.
- 1933లో మహారాష్ట్రలోని సాంగ్లీలో జననం.
- ప్రముఖ గాయని లతా మంగేష్కర్‌కు ఆశాభోస్లే సోదరి.
- ఏడుసార్లు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు కైవసం
- రెండుసార్లు జాతీయ ఉత్తమ గాయని అవార్డులు.
- 2000 సంవత్సరంలో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు.
- 2008లో పద్మవిభూషణ్ పురస్కారం అందుకున్న ఆశాభోస్లే



# చర్చలు విఫలం

- అమెరికావి గొంతెమ్మ కోరికలు..ఇరాన్
- మా నిబంధనలను ఇరాన్ అంగీకరించలేదు : జేడీ వాన్స్
- లెబనాన్‌పై ఆగని ఇజ్రాయిల్ దాడులు..ఆరుగురు మృతి
- తదుపరి పరిణామాలపై ఉత్కంఠ

ఇస్లామాబాద్ - సూర్య వాస్తవం

పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించి శాంతిని నెలకొల్పేందుకు ఇరాన్, అమెరికా మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యా యి. సహేతుకం కాని డిమాండ్లను ముందుకు తెచ్చారంటూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. తమ నియమ నిబంధనలకు ఇరాన్ అంగీకరించలేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చెప్పగా అమెరికా చేసిన అర్ధం పర్ధం లేని డిమాండ్ల కారణంగానే చర్చలు విఫలమయ్యాయని ఇరాన్ ఆరోపించింది. యుద్ధంలో సాధించలేని వాటిని అమెరికా ప్రస్తావించిందని దుయ్యబట్టింది. శాంతి చర్చలు విఫలమైన నేపథ్యంలో పశ్చిమాసియాలో ఏం జరుగుతుందోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో - మిగతా 2లో..





## ఆమె కీర్తి అజరామరం

### - ఆశా భోంస్లే మృతి పట్ల సీఎం చంద్రబాబు సంతాపం

అమరావతి - సూర్య వాస్తవం

ప్రముఖ గాయని, సంగీత ప్రపంచంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఆశా భోంస్లే కన్నుమూశారు. ఆమె మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆశా భోంస్లే మరణ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు. " ప్రముఖ గాయని ఆశా భోంస్లే జీ ఇక లేరన్న వార్త విని నేను తీవ్ర దిగ్భ్రాంతికి, బాధకు గురయ్యాను. భారత సంగీత ప్రపంచంలో ఆమె ఒక దిగ్గజం. ఆమె లాంటి విలక్షణమైన, వైవిధ్యమైన గాయని మరొకరు లేరంటే అతిశయోక్తి కాదు. ప్రపంచంలోనే అత్యధిక పాటలు పాడిన కళాకారిణిగా చరిత్రలో నిలిచిపోయిన ఆమె కీర్తి అజరామరం. ఏడు దశాబ్దాలకు పైగా సాగిన ఆమె సంగీత ప్రస్థానం అసాధారణమైనది. ఆమె పాడిన పాటలు ఎన్నో తరాలను ఉర్రూతలూగించాయి, మనందరి జీవితాల్లో భాగమైపోయాయి. ఆమె గాత్రంలోని మాధుర్యం, భావం మరపురానివి. పద్మవిభూషణ్ వంటి - మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వండి



### - ఫ్లోర్ లీడర్లకు ప్రధాని మోడీ లేఖ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

మహిళా రిజర్వేషన్ చట్టం (నారీశక్తి వందన్ అధినియమ్) సవరణ బిల్లుకు మద్దతు కోరుతూ అన్ని పార్టీల ఫ్లోర్‌లీడర్లకు ప్రధాని మోడీ లేఖ రాశారు. వ్యక్తులు, పార్టీలకు అతీతంగా చట్టాన్ని నిజమైన స్ఫూర్తితో అమలు చేసేందుకు సమయం ఆసన్నమైందని అందులో పేర్కొన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలను 33 శాతం మహిళా రిజర్వేషన్‌తో నిర్వహిద్దామని వివరించారు. విస్తృత సంప్రదింపుల అనంతరం నారీశక్తి వందన్ అధినియమ్ అమలుకు సమయం ఆసన్నమైందనే నిశ్చితాభిప్రాయానికి వచ్చామని, 2029 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు మహిళా రిజర్వేషన్ తో నిర్వహించడం అనివార్యమని లేఖలో ప్రధాని పేర్కొన్నారు. మహిళలు, భవిష్యత్ తరాల కోసం బాధ్యత తీసుకోవాలని పార్టీలను కోరారు. ఇందుకోసం పార్లమెంటులో చర్చను స్వాగతిస్తున్నామని వివరించారు. ఎంపీలంతా ఏకం కావాలని - మిగతా 2లో..



## ఆశా భోంస్లేది ఒక ఐకానిక్ స్వరం

### - డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి - సూర్య వాస్తవం

ప్రముఖ గాయని, లెజెండరీ సింగర్ శ్రీమతి ఆశా భోంస్లే మరణవార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ సినిమాలో ఆశా భోంస్లేది ఒక ఐకానిక్ స్వరమని, ఆమె లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. "హిందీతో పాటు మరాఠీ, తెలుగు, బెంగాలీ సహా అనేక భాషలలో కొన్ని దశాబ్దాల పాటు ఆశా భోంస్లే గారు లెక్కలేనన్ని - మిగతా 2లో..

## జూన్ తర్వాతే కార్పొరేషన్ పదవులు..

- అప్పటికి పాతవారి కాలపరిమితి ముగింపు
- ఖాళీ అయ్యేవి.. ఖాళీగా ఉన్నవి అప్పుడే భర్తీ చేద్దాం
- సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం

హైదరాబాద్ - సూర్య వాస్తవం

అధికార పార్టీలో ఆశావహులు ఎదురు చూస్తున్న కార్పొరేషన్ చైర్మెన్, పాలక మండలి సభ్యుల పోస్టుల భర్తీ... రెండడగులు ముందుకు, నాలుగడుగులు వెనక్కి అన్నట్టుగా కొనసాగుతోంది. కాంగ్రెస్ అధిష్టానంతో సంప్రదింపులు, సమాలోచనలు చేయటం, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి జాబితాలు రెడీ చేయటం.. ఆ తర్వాత వాటిని పక్కకు పెట్టటం షరా మామూలైపోయిందనే వాదనలు వినబడుతు



న్నాయి. దీంతో పదవులపై గంపెడాశలు పెట్టుకున్న జిల్లా, రాష్ట్ర స్థాయి నేతల్లో నైరాశ్యం నెలకొంది. 'పదేండ్లపాటు పార్టీ అధికారానికి దూరంగా ఉన్న సమయంలో ఎటూవెళ్లకుండా అంటిపెట్టుకునే ఉన్నాం.. బీఆర్ఎస్ ఒత్తిళ్లు, బెదిరింపులకు లొంగకుండా కాంగ్రెస్ జెండాను వదలకుండా - మిగతా 2లో..

## దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్...

### - ఈ నెల 14న చంద్రబాబు ప్రారంభిస్తున్నారు

### - మంత్రి నారా లోకేశ్

అమరావతి - సూర్య వాస్తవం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం టెక్నాలజీ రంగంలో ఒక చారిత్రక ఘట్టానికి సిద్ధమవుతోంది. భారతదేశంలోనే మొట్టమొదటి దేశీయ, ఓపెన్-యాక్సెస్ క్వాంటం కంప్యూటర్లను అమరావతిలో ఆవిష్కరించనున్నారు. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 14న ముఖ్యమంత్రి చంద్రబాబు వీటిని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా కీలక వివరాలు పంచుకున్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'అమరావతి 1ా', 'అమరావతి 1ు' పేరుతో ఈ క్వాంటం కంప్యూటర్లను జాతికి అంకితం చేయనున్నట్లు తెలిపారు. - మిగతా 2లో..

# ఆమె కీర్తి అజరామరం

(మొదటిపేజీ తరువాయి)

అత్యున్నత పురస్కారం ఆమె ప్రతిభకు ఒక చిన్న గుర్తింపు మాత్రమే. భారతదేశ సంగీత వారసత్వంలో ఆమె స్థానం ఎప్పటికీ పదిలంగా ఉంటుంది. ఆమె పాటల రూపంలో మన మధ్యే చిరస్థాయిగా జీవించి ఉంటారు. ఈ విషాద సమయంలో, ఆమె కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది అభిమానులకు నా తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను " అంటూ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

# జూన్ తర్వాతే కార్పొరేషన్ పదవులు..

(మొదటిపేజీ తరువాయి)

పట్టుకున్నాం.. అందరి కృషి వల్ల మళ్లీ పార్టీ అధికారంలోకి వచ్చింది. రెండున్నరేండ్లయినా మమ్మల్ని గుర్తించకపోతే ఎలా...?' అంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆశావహులు గాంధీ భవన్ చుట్టూ చక్కర్లు కొడుతుండటంతో ఇప్పుడు మళ్లీ కార్పొరేషన్ పదవుల భర్తీ అంశం చర్చకొచ్చింది. అయితే ఆయా పదవులను ఇప్పటికిప్పుడే కాకుండా జూన్ తర్వాతే భర్తీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించినట్టు సమాచారం. వాస్తవానికి కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జులైలో పలు కార్పొరేషన్లకు చైర్మెన్లను నియమించారు. వారందరూ అదే నెలలో బాధ్యతలను స్వీకరించారు. ఆ చొప్పున వారి పదవీ కాలం (రెండేండ్లు) మరో రెణ్నెల్లలో పూర్తవుతుంది. దాంతో దాదాపు 40 నుంచి 50 కార్పొరేషన్ల పదవులు ఖాళీ కానున్నాయి. ఇవిగాకుండా మరో 50 కార్పొరేషన్ల చైర్మెన్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. వీటన్నింటినీ కలిపి జులైలో భర్తీ చేయాలని సీఎం నిర్ణయించారు. అలాగైతే మొత్తం 150 నుంచి 200 మంది దాకా పదవులివ్వొచ్చన్నది (కార్పొరేషన్ చైర్మెన్ పోస్టులు, సభ్యులు కలిపి) ఆయన వ్యూహంగా కనబడుతున్నది. ఆ తర్వాత నిర్వహించబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ, జీహెచ్ఎమ్‌సీ ఎన్నికలకు వారందర్నీ రంగంలోకి దించాలని సీఎం భావిస్తున్నారు. ఈ ప్లాన్‌కు సక్సెస్‌ఫుల్‌గా అమలు చేయగలిగితే వారితో మరింత ఉత్సాహంగా పని చేయించుకోవచ్చని ఆయన భావిస్తున్నారు.

# ఆశా భోంస్లేది ఒక ఐకానిక్ స్వరం

(మొదటిపేజీ తరువాయి)

చిరస్మరణీయ గీతాలను ఆలపించారు. శాస్త్రీయ, పాశ్చాత్య, సమకాలీన సంగీత శైలులలో ఆమె చూపిన అసాధారణమైన బహుముఖ ప్రజ్ఞ అన్ని తరాల సంగీత ప్రియుల మన్ననలను పొందింది" అని కొనియాడారు. "దమ్ మారో దమ్", "చురాలియా హై తుమ్నే", "ఇన్ ఆంఖోం కీ మస్తీ", "రాధా కైసే నా జలే" వంటి ఆమె పాటలు ఎప్పటికీ నిలిచిపోతాయని పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. తెలుగు సినిమాలలో ఆమె పాడిన పాటలు తక్కువే అయినా, హిందీ సంగీతం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఆమె ఎంతో ఆదరణ పొందారని తెలిపారు. ఈ దుఃఖ సమయంలో ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పవన్ పేర్కొన్నారు.

# దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్...

(మొదటిపేజీ తరువాయి)

దీని ద్వారా అమరావతిని 'క్వాంటం వ్యాలీ'గా, ఒక గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ పేర్కొన్నారు. "భారత్‌లో తయారై, భారతీయులకు అందుబాటులో ఉంటూ, ప్రపంచానికి సేవలు అందించడమే" తమ ధ్యేయమని ఆయన వివరించారు. ఈ పరిణామంతో దేశ క్వాంటం భవిష్యత్తుకు ఆంధ్రప్రదేశ్ నాయకత్వం వహిస్తుందని, భవిష్యత్ టెక్నాలజీ అమరావతి నుంచే మొదలవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ఆవిష్కరణతో క్వాంటం కంప్యూటింగ్ రంగంలో ఏపీ కీలక పాత్ర పోషించనుంది.

# యూత్ కాంగ్రెస్ నేత పెండ్లికి హాజరైన సీఎం రేవంత్



కొడంగల్ – సూర్య వాస్తవం

వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని చెన్నకేశవ ఫంక్షన్ హాల్‌లో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్– మమత వివాహం ఆదివారం జరిగింది. ఈ వివాహానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. రేవంత్‌రెడ్డి కొడంగల్ వచ్చిన మొదటి నుంచి రెడ్డి శ్రీనివాస్ ఆయన వెన్నంటే ఉన్నారు. కృష్ట, సుఖాలలో పాలుపంచుకున్నారు. రేవంత్‌రెడ్డి విజయంలోనూ కీలక భూమిక పోషించారు. సీఎంకి నమ్మినబంటుగా ఉంటూ.. యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడి స్థాయికి ఎదిగారు. శ్రీనివాస్ అంకితభావం, పట్టుదల, పనికోసం చేసిన తీరును మరచిపోనని చెప్పిన రేవంత్‌రెడ్డి శ్రీనివాస్ వివాహానికి హాజరుకావడంతో కుటుంబ సభ్యులు, కార్యకర్తల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. అంతకుముందు సీఎంకు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహమేహ్రా, ప్రజా ప్రతినిధులు పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బుయ్యాని మనోహర్‌రెడ్డి, రాజ్ ఠాకూర్‌తోపాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

# చర్చలు విఫలం

(మొదటిపేజీ తరువాయి)

21 గంటల పాటు ఇరాన్, అమెరికా ప్రతినిధుల మధ్య ప్రత్యక్షంగా జరిగిన సుదీర్ఘ చర్చలు విఫలమయ్యాయి.

'మేము ఒప్పందానికి రావడంలో విఫలమయ్యాం. ఇది దుర్వార్త. అమెరికాతో పోలిస్తే ఇరాన్‌కే ఇది మరింత దుర్వార్త అవుతుంది' అని అమెరికా ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించిన జేడీ వాన్స్ వ్యాఖ్యానించారు. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత తొలిసారిగా అమెరికా, ఇరాన్ మధ్య జరిగిన ఉన్నత స్థాయి చర్చలు విఫలమైన తర్వాత స్వదేశానికి తిరుగు ప్రయాణం కావడానికి ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ నిబంధనలకు ఇరాన్ అంగీకరించలేదని ఆరోపించారు. అణ్వాయుధాలను అభివృద్ధి చేయబోమని, వాటిని త్వరితగతిన తయారు చేసేందుకు అవసరమైన ఉపకరణాలను పొందబోమని ఇరాన్ హామీ ఇస్తుందని భావించామని, కానీ అది జరగలేదని చెప్పారు. చర్చల సందర్భంగా తాము ఎంతో సానుకూలంగా వ్యవహరించామని చెప్పుకొచ్చారు.

మంచి ఉద్దేశంతో ఇస్లామాబాద్ వచ్చామని, ఒప్పందం కోసం ఎంతగానో ప్రయత్నించామని, అయితే దురదృష్టవశాత్తూ దానిని సాధించలేకపోయామని తెలిపారు. ఇరాన్‌తో ఒప్పందం కుదరకపోయినప్పటికీ తమ ప్రతిపాదనలపై స్పందించడానికి ఆ దేశానికి కొంత సమయం ఇస్తామని అన్నారు. సుదీర్ఘంగా చర్చలు జరిపినప్పటికీ తమ మధ్య నెలకొన్న విభేదాలను ఇరు పక్షాలు పరిష్కరించుకోలేకపోయాయని, అందుకే ఒప్పందం కుదరలేదని చెప్పారు. తమకు అపూర్వ ఆతిథ్యమిచ్చిన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సైనిక దళాల ప్రధానాధికారి ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌లను ఆయన ప్రశంసలతో ముంచెత్తారు. చర్చల వివరాలను దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, విదేశాంగ మంత్రి మార్కో రుబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేథ్, ఆర్థిక మంత్రి బెస్సెంట్‌లకు ఎప్పటికప్పుడు తెలియజేశామని వివరించారు. విలేకరుల సమావేశం తర్వాత వాన్స్ బృందం స్వదేశానికి బయలుదేరింది.

**హార్ముజ్‌లో కదులుతున్న నౌకలు**

ఇరాన్, అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో హార్ముజ్ జలసంధిలో చమురు నౌకలు ఇప్పుడిప్పుడే నెమ్మదిగా కదులుతున్నాయి. లిబియా పతాకంతో సెరిఫోస్, చైనా పతాకంతో కాస్పెరల్ లేక్, హీ రంగ్ హారు నౌకలు హర్మూజ్‌ను దాటాయి. వీటిలో ప్రతి నౌకకు రెండు మిలియన్ బ్యారల్స్ చమురును రవాణా చేయగల సామర్థ్యం ఉంది. థాయిలాండ్‌కు చెందిన ఏడు చమురు నౌకలు ఇరాన్ అనుమతుల కోసం హర్మూజ్‌లో నిలిచి ఉండగా వాటిలో ఒకటైన సెరిఫోన్‌కు క్లియరెన్స్ లభించింది. ఈ నౌక సౌదీ అరేబియా నుంచి యూఏఈకి చమురును తీసుకొని మార్చిలో బయలుదేరింది. సెరిఫోన్ ఈ నెల 21న మలేసియాలోని మలక్కా ఓడరేవుకు చేరుకునే అవకాశం ఉంది. కాగా ఓషన్ థండర్ అనే నౌక ఇరాక్ ముడి చమురుతో గత వారమే హార్ముజ్‌ను దాటింది. ఇరాక్ చమురును రవాణా చేస్తున్న కాస్పరల్ లేక్ నౌక తూర్పు చైనాలోని జౌషన్ ఓడరేవుకు మే 1న చేరుకుంటుంది. సౌదీ ముడి చమురుతో హర్మూజ్‌ను దాటిన హీ రంగ్ హాయ్ నౌక ఎక్కడికి వెళుతోందో తెలియడం లేదు.

**ఇరాన్‌కు ఆయుధాలిస్తే పెను సమస్యలు తప్పవు**
**చైనాకు ట్రంప్ బెదిరింపులు..**
**నిరాధార ఆరోపణలన్న బీజింగ్**

ఇరాన్‌కు ఆయుధాలతో నింపిన నౌకలను సరఫరా చేస్తే 'పెను సమస్యల'ను ఎదుర్కోవాల్సి వస్తుందని చైనాను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం బెదిరించారు. రాబోయే వారాలలో ఇరాన్‌కు గగనతల రక్షణ వ్యవస్థలను, మాన్‌పాడ్స్‌ను (క్షిపణి విధ్వంసక వ్యవస్థలు) సరఫరా చేసేందుకు చైనా సన్నాహాలు చేస్తోందంటూ అమెరికా ఇంటెలిజెన్స్ విభాగం సమాచారం ఇచ్చిన నేపథ్యంలో ట్రంప్ ఈ బెదిరింపులకు దిగారు. ఒకవేళ చైనా ఆ పని చేస్తే పెద్ద సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన విలేకరుల సమావేశంలో హెచ్చరించారు. అయితే దీనిపై ఆయన మరింత వివరణ ఏదీ ఇవ్వలేదు. ఇంటెలిజెన్స్ అంచనాలతో సంబంధమున్న ముగ్గురు వ్యక్తులు ఇచ్చిన సమాచారాన్ని ఉటంకిస్తూ సీఎన్ఎన్ వార్తా సంస్థ ఈ సమాచారాన్ని అందించింది. తన ప్రమేయం బయటపడకుండా మూడో దేశం ద్వారా ఆయుధాలను సరఫరా చేయాలని చైనా భావిస్తోందని కూడా సీఎన్ఎన్ వివరించింది. కాగా యుద్ధంలో మాన్‌పాడ్స్‌ను ఉపయోగించిన ఇరాన్...తక్కువ ఎత్తులో ప్రయాణించిన అమెరికా యుద్ధ విమానానికి సమస్యలు సృష్టించింది. కాగా ఈ ఆరోపణలను వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి ఒకరు తీవ్రంగా ఖండించారు. యుద్ధంలో పాల్గొన్న వారెవ్వరికీ చైనా ఆయుధాలను అందించలేదని ఆయన స్పష్టం చేశారు. ఇవి నిరాధార ఆరోపణలని, సంచలనం సృష్టించేందుకు ఉద్దేశించినవని అంటూ ఉద్రిక్తతలను నివారించేందుకు జరిగే ఏ ప్రయత్నానికి అయినా చైనా మద్దతు ఇస్తుందని తెలిపారు.

**యుద్ధంలో 3,375 మంది ఇరాకీల మృతి**

అమెరికా–ఇజ్రాయిల్ దాడులు మొదలైన తర్వాత కనీసం 3,375 మంది ఇరాకీలు మరణించారని ప్రభుత్వ ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ బ్రాడ్‌కాస్టింగ్ (ఐఆర్ఐబీ) తెలిపింది. మృతులను ఇరాన్‌కు చెందిన ఫోరెన్సిక్ మెడిసిన్ ఆర్గనైజేషన్ గుర్తించింది. మృతులలో 2,875 మంది పురుషులు కాగా 496 మంది మహిళలు.

**హార్ముజ్ జలసంధిని దిగ్బంధించండి**
**ట్రంప్ ఆదేశాలు**

ఇరాన్‌తో చర్చలు విఫలమైన వేళ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ట్రూత్ సోషల్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. "హర్మూజ్‌ను దిగ్బంధించాలని మా దేశ నౌకాదళాన్ని ఆదేశించాం. జలసంధిలోకి నౌకలు ప్రవేశించకుండా లేదా నిష్క్రమించకుండా అమెరికా నౌకలు అడ్డుకోవడం మొదలుపెడతాయి. అంతర్జాతీయ జలాల్లో ఇరాన్‌కు సుంకం చెల్లించిన ప్రతి నౌకను వెంబడి స్తాం. చట్టవిరుద్ధమైన టోల్ చెల్లింపులు జరిపినా ఎవరికీ అంతర్జాతీయ సముద్రాలపై సురక్షితమైన ప్రయాణం ఉండదు. సరైన సమయంలో ఇరాన్ ను అంతం చేయడానికి సిద్ధంగా ఉన్నాం." అని పేర్కొన్నారు. హార్ముజ్‌ను తెరుస్తామని ఇరాన్ వాగ్దానం చేసింది. కానీ మాట తప్పింది.ఇరాన్ చర్యలతో అనేక దేశాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. జలసంధిని వెంటనే తెరవాలి.. అణు కార్యక్రమాన్ని విడిచిపెట్టేందుకు ఇరాన్ సిద్ధంగా లేకపోవడం వల్లే చర్చలు బెడిసికొట్టాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇరాన్ చేతికి అణ్వాయుధాలు చిక్కనివ్వనని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు.

**మా విశ్వాసం పొందలేకపోయారు**
**ఇరాన్ స్పష్టీకరణ**

పాకిస్తాన్‌లో అమెరికాతో చర్చల అనంతరం ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘలీబఫ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఓ ప్రకటన చేశారు. శాంతి చర్చల్లో పాల్గొన్న ఇరాన్ ప్రతినిధి బృందంలో ఆయన కూడా సభ్యుడిగా ఉన్న విషయం తెలిసిందే. '"చర్చల సమయంలో మా విశ్వాసాన్ని పొందడంలో అమెరికా విఫలమైంది. ఇరాన్ ప్రతినిధి బృందంలోని నా సహచరులు 168 నిర్మాణాత్మక చర్యలు సూచించారు. గత రెండు యుద్ధాల అనుభవాల దృష్ట్యా ఇరు పక్షాలు పరస్పర విశ్వాసాన్ని పొందలేకపోయాయి" అని రాసుకొచ్చారు. అయితే ఒప్పందానికి రెండు,మూడు కీలక అంశాలే అవరోధంగా మారాయని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయి తెలిపారు. కొన్ని అంశాలపై ఇరు పక్షాలు ఏకాభిప్రాయానికి వచ్చినా, ఇతర అంశాలపై బిన్నాభిప్రాయాలు నెలకొన్నాయని వివరించారు. అయితే 'దౌత్యం ఎన్నటికీ ముగియబోదు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఒక్క సమావేశంలోనే ఒప్పందం కుదరదు కదా అని చెప్పారు.

**లెబనాన్‌పై కొనసాగిన దాడులు**

దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులు కొనసాగుతున్నాయి. అమెరికా–ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమైన నేపథ్యంలో దాడుల ఉధృతి పెరిగింది. ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు రెండు లెబనాన్ పట్టణాలపై దాడులు చేశాయని లెబనాన్ మీడియా తెలిపింది. మారబ్ పట్టణంలో ఏడుగురు సభ్యులున్న ఓ కుటుం బం నివసిస్తున్న ఇంటిపై దాడి జరగగా కొందరు చనిపోగా మరికొందరు గాయపడ్డారు. దక్షిణ లెబనాన్‌లోని జోయాలో ప్రయోగించేందుకు సిద్ధంగా ఉంచిన రాకెట్ లాంఛర్‌ను ధ్వంసం చేశామని ఇజ్రాయిల్ రక్షణ దళాలు తెలిపాయి.

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

ఆయన పిలుపునిచ్చారు. "మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లును ఆమోదించే విషయంలో అందరినీ ఒకేతాటిపైకి రావాలని కోరేందుకు ఈ లేఖ రాస్తున్నాను. పార్లమెంటులో ఎక్కువ మంది తమ అభిప్రాయాలను పంచుకోవడం అందరికీ గర్వకారణమవుతుంది. వ్యక్తులు, పార్టీలకు అతీతంగా, మహిళలు, భవిష్యత్ తరాల పట్ల బాధ్యతను చాటుకునే సందర్భమిది. మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని చాలాకాలంగా సభ్యులు కోరుతున్నారు. వారి ఆకాంక్షలు కార్యరూపం దాల్చే సమయం ఇప్పుడు వచ్చింది. 140 కోట్ల మంది భారతీయులు, నారీశక్తి సాధించిన విజయం ఇది. ఈ చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించేందుకు అంతా కలిసికట్టుగా ముందుకు వస్తారనే పూర్తి నమ్మకం నాకు ఉంది" అని మోడీ లేఖలో పేర్కొన్నారు. మహిళలు ఎదిగేందుకు, నిర్ణయాలు తీసుకునేందుకు, ప్రత్యేకించి నాయకత్వం వహించేందుకు ఎంతగా అవకాశమిస్తే అంత గా సమాజం ప్రగతి పథంలోకి వెళ్తుందని వివరించారు. అభివృద్ధి చెందిన దేశంగా ఇండియా విజన్ సాకారం కావాలంటే ఈ ప్రయాణంలో మహిళలు కీలకమైన, చురుకైన పాత్ర పోషించడం అవసరమని మోడీ పేర్కొన్నారు. ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ ప్రారంభించనున్నట్టు లేఖలో ప్రధాని వివరించారు.

**ఆదరబాదరగా బిల్లు అమలుకు కేంద్రం యత్నం : ఖర్గే**

నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం (యూటీ)లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మహిళా రిజర్వేషన్ బిల్లును ఆదరబాదరగా అమలు చేసేందుకు కేంద్రం ప్రయత్నించడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు. ఇది కేవలం రాజకీయ లబ్ధి కోసం తీసుకుంటున్న చర్యగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని మోడీకి ఖర్గే లేఖ రాశారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ఎలాంటి వివరాలూ వెల్లడిం చకుండా మళ్లీ తమ సహకారం కోరడం సరికాదని, ఈ చట్టంతో ముడిపడిన కీలకాంశా లపై అర్థవంతమైన చర్చ జరగాలని ఖర్గే వివరించారు. ఇందుకోసం ఈ నెల 29 తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. "నారీశక్తి వందన్ అధినయమ్ 2023 సెప్టెంబర్‌లో పార్లమెంటులో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన విషయం మీకు తెలుసు. ఆ సమయంలో తక్షణం ఈ కీలక చట్టాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ తరఫున నేను స్వయంగా కోరాను" అని ఖర్గే గుర్తుచేశారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన వివరాలు వెల్లడించకుండా విపక్షాల సహకారాన్ని కేంద్రం కోరుతోందని, డీలిమిటేషన్, ఇతర కీలకాంశాలకు సంబంధిం చిన వివరాలు లేకుండా ఈ చారిత్రక చట్టంపై అర్థవంతమైన చర్చ సాధ్యం కాదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపిందని ప్రధాని పేర్కొన్నారని, అయితే అది నిజం కాదని ఖర్గే అన్నారు. మిగిలిన మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఈ నెల 29న ముగుస్తాయని, ఆ తర్వాత ఎప్పుడైనా సరే రాజ్యాంగ సవరణలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు కోరిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశం ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసేందుకు, అందరినీ ఏకతాటిపై ముందుకు తీసుకు వెళ్లేందుకు ఉద్దేశించినదే అయితే నారీశక్తి వందన్ అధినియమ్–2023 సవరణతో ముడిపడిన డీలిమిటేషన్‌పై చర్చ జరిపేందుకు ఈ నెల 29 తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రధానికి రాసిన లేఖలో ఖర్గే సూచించారు.

**బీజేపీ మూడు లైన్ల విప్ జారీ**

ఈ నెల 16, 17, 18 తేదీల్లో పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో తమ పార్టీ ఎంపీలకు బీజేపీ మూడు లైన్ల విప్ జారీ చేసింది. ఎంపీలంతా ఈ సమావేశాల సమయంలో తప్పనిసరిగా హాజరుకావాలని ఆ విప్‌లో కోరింది. కేంద్రమంత్రులతో సహా ఎంపీలంతా ఈ మూడు రోజులు సభలోనే ఉండాలని, ఎలాంటి సెలవులూ మంజూరు చేసేదిలేదని స్పష్టం చేసింది. హాజరు కచ్చితంగా ఉండాలని విప్ పేర్కొంది. ఈ ప్రత్యేక సమావేశాల్లో ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుపై దృష్టి పెట్టడం, రిజర్వేషన్ అమలు కాలపరిమితికి సంబంధించి కీలక సవరణలు చేసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. జనాభా గణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్ అమలు కావాలని నారీశక్తి వందన్ అధినయమ్–2023 చెబుతోంది. అయితే జనగణనలో జాప్యం జరుగుతున్నందున 2011 జనాభా లెక్కల ఆధారంగానే ముందుకు వెళ్లాలని కేంద్రం ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది.

# వివాహ వేడుకల్లో వైసిపి శ్రేణులు



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణంలో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకలు ఘనంగా జరగగా వైసిపి శ్రేణుల అభిమానుల ప్రత్యేక ఆహ్వానం మేరకు జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి పలు వైసీపీ శ్రేణులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వాటిలో భాగంగా పులివెందుల పట్టణ పరిధిలోని వీజీ పెన్షన్ హాల్ నందు గొద్దిపల్లి సర్పంచ్ రామాంజనేయులు కుమారుని వివాహానికి హాజరై నూతన వధూవరులైన చంద్ర కిరణ్ , యశ్విత లను నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వివాహ బంధం అతి పవిత్రమైనదని అక్షింతలు వేసి ఆశీర్వదించడం జరిగినది .ఈ వివాహ వేడుకల్లో వేముల మండలం ఇన్చార్జి సాంబశివారెడ్డి , వేముల మండల జడ్పిటిసి బైప రెడ్డి , అలాగే పులివెందుల పట్టణ అధ్యక్షులు హాల్ గంగాధర్ రెడ్డి , వైసీపీ నాయకులు పార్లపల్లి కిషోర్, తోటం శెట్టి హరి, పుర పట్టణ ప్రముఖ వైసిపి నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వివాహ వేడుకల్లో ఎంపీ అవినాష్ రెడ్డితో పలువురు ఆప్యాయంగా పలకరించగా కొద్దిసేపు వివాహ వేడుకల్లో ఆనందంగా గడిపారు.


## వధూవరులను ఆశీర్వదించిన పేర్ల శేషా రెడ్డి



**వేముల - సూర్య వాస్తవం:** వేముల ఎస్సీ కాలనీకి చెందిన గోపాల్ కుమార్తె వివాహ వేడుకలు ఆదివారం అత్యంత ఘనంగా జరిగాయి. ఈ వివాహ వేడుకలకు గోపాల్ ప్రత్యేక ఆహ్వానం మేరకు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి సోదరుడు పేర్ల శేషా రెడ్డి హాజరై నూతన వధూవరులను నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వివాహ బంధం అది పవిత్రమైనదని ఆ విలువ చాలా గొప్పదని తెలియజేస్తూ ఆశీర్వచనాలు అందించారు. అనంతరం వివాహ వేడుకల్లో పలువురు శ్రేయోభిలాషులు అభిమానులు శేషారెడ్డి ఆప్యాయంగా పలకరించగా కొద్దిసేపు వివాహ వేడుకల్లో ఆప్యాయంగా గడిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, గోపాల్ బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

### భాకరాపురం చీకటిమయం


## వీధిలైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని భాకరాపురంలో వీధిలైట్లు వెలగక చీకటిమయంతో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతవాసులు మాట్లాడుతూ వీధిలైట్లు వెలగడం లేదని, మరమ్మత్తులు కూడా చేపట్టడం లేదని, పలుమార్లు సంబంధిత అధికారులకు తెలిపినప్పటికీ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని, రాత్రి సమయాలలో చీకటిమయంలో కుక్కల బెడదతో పలు ఇబ్బందులు ప్రమాదాలు ఎదుర్కోవడం జరుగుతుందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులైన, ప్రజా ప్రతినిధులైన స్పందించి భాకరాపురంలో వీధిలైట్లు వెలిగించాలని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## నారిశక్తితో మహిళా రిజర్వేషన్లు కల్పిస్తున్న బిజెపి ప్రభుత్వం

### మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెడబల్లి సుష్మ



**వేంపల్లె - సూర్య వాస్తవం:** దేశ ప్రధాని నరేంద్ర మోడీ నారీ శక్తి నవభారతం ద్వారా సమాజంలో సగభాగమైన మహిళలకు చట్టసభల్లో 33% మహిళా రిజర్వేషన్లు కల్పించడం ఒక వరం లాంటిదని పెడబల్లి సుష్మ మాట్లాడారు. తదనంతరం నకలను మోదీ ప్రభుత్వం నెరవేర్చడం చాలా సంతోషంగా ఉంది అన్నారు. ఈ బిల్లు యొక్క ముఖ్య ఉద్దేశం 2029 ఎలక్షన్ నాటికి లోక్సభ మరియు అసెంబ్లీ స్థానాలలో మహిళలు ఎక్కువగా పోటీ చేయాలని ఉద్దేశంతో పార్లమెంట్ సభలలో ఈ బిల్లును పాస్ చేయడం జరుగుతుంది అని అన్నారు. ఎప్పుడైతే మహిళ బాగుంటుందో ఆ కుటుంబం బాగుంటుంది,రాష్ట్రం బాగుంటుంది. రాష్ట్రం బాగుంటుందో దేశం బాగుంటుంది అని ఆమె తెలిపారు. ఈ మహిళ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టినందుకు మోడీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### ముఖ్యమంత్రి గారూ! రాజధానికి చట్టబద్ధత సరే..

### మరి ఇప్పటికే చట్టబద్ధత ఉండి

# అమలు కాని అంశాల మాటేమిటి?

## -మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**రాయచోటి - సూర్య వాస్తవం:** రాష్ట్ర రాజధాని అమరావతికి పార్లమెంటు చట్టం ద్వారా చట్టబద్ధత కల్పించడం హర్షణీయమైనప్పటికీ ఇప్పటికే చట్టబద్ధత ఉండి11 సంవత్సరాలు అయినా అమలుకాని అంశాల మాటేమిటి అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ఆదివారం రాయచోటిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో సెక్షన్ 94 సబ్ సెక్షన్ 3 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాజధానిలో రాజ్ భవన్,రాష్ట్ర సచివాలయం,హైకోర్టు, శాసనసభ, శాసనమండలి భవనాలు,ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులు ఇవ్వాలని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో సెక్షన్ 46 సబ్ సెక్షన్ 3 ప్రకారము రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో సెక్షన్ 85 సబ్ సెక్షన్ 2 ప్రకారము రాష్ట్ర విభజన జరిగిన 60 రోజు లోపల కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్లో ఏర్పాటు చేయాలని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. 11 సంవత్సరాలు అయినా

సాధించేందుకు కృషి చేయాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

**ఫ్రీ జోన్ గా ప్రకటించాలి**

రాజధాని అమరావతి ప్రాంతాన్ని ఫ్రీ జోన్ గా ప్రకటించాలని తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విద్యా, ఉద్యోగాలకు సంబంధించి, స్థానిక స్థానికేతర అంశాలకు సంబంధించి రాష్ట్రాన్ని 6 జోన్లుగా విభజించడం జరిగింది . అందులో రాజధాని ప్రాంతం 4 వ జోన్ పరిధిలోకి వస్తుంది. రాజధాని ప్రాంతంలో విద్యా, ఉద్యోగాలలో అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఆ అవకాశాలను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వారికి లభించేటందుకు గాను రాజధాని ప్రాంతాన్ని ఫ్రీ జోన్ గా ప్రకటించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తులసి రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హైదరాబాదును ఫ్రీ జోన్ గా ప్రకటించినట్లే నవ్యాంధ్రప్రదేశ్ లో రాజధాని అమరావతి ప్రాంతాన్ని ఫ్రీ జోన్ గా ప్రకటించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో ఎపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లా బకష్, డిసిసి ఉపాధ్యక్షుడు ఖదీర్, అమర్నాథరెడ్డి, ఉత్తన్న, ఐచర్ రమణ,నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

### మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

### ఉపాధి కూలీల కడుపులు కొట్టే

# విబి జి రామ్ జి రద్దు చేయాలి



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి విప్లవాది వందనాలు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసినటువంటి కేంద్ర ప్రభుత్వంపై ఈనెల 10వ తా రీఖు నుండి 12వ తారీకు వరకు సి పిఐ సిపిఐ జాతీయ నాయకులు కామ్రేడ్ రామకృష్ణ ఆధ్వర్యంలో పా దయాత్ర నిర్వహించడం జరుగు తుంది. గతంలో ఈ పథకాన్ని అనం తపూర్ జిల్లా నార్పల మండలం బం డ్లపల్లిలో గత కాంగ్రెస్ ప్రభుత్వంలో బండ్లపల్లిలో అప్పటి ప్రధాని మన్మో హన్ సింగ్,సోనియా గాంధీ మన ఉ మ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ ఉ పాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టి ఈ పథకాన్ని అమలు చేయడం జరిగిం ది. మరి ఇప్పుడున్నటువంటి బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని మార్చి జి రామ్ జి అనే పేరును అమలులోకి తేవడం జరిగింది మరి 90% కేంద్ర ప్రభుత్వా లు అమలు చేస్తున్న టివి గతంలో ఇప్పుడు ఈ పథకాన్ని నీరుగారు స్తూ రాష్ట్ర ప్రభుత్వం 40% కేంద్ర ప్ర భుత్వం 60% లాగా ఈ పథకాన్ని అమలు చేసే విధంగా చట్టాన్ని అమ లు చేస్తున్నారు. ఈ ఉపాధి హామీ ప థకాన్ని నిర్వీర్యం చేయకుండా గతం లో ఇలా చేపట్టారు అదే ప్రకారంగా చేపట్టాలని ఈ రోజు 12వ తారీకున బండ్లపల్లి వరకు పాదయాత్రలో పా ల్గొని పెద్ద ఎత్తున బహిరంగ సభ ని ర్వహించుకోబోతున్నాము ఈరోజు గుత్తి నుండి గుంతకల్లు ఐదు బస్సు ల్లో బయలుదేరి పోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కార్యద ర్శి జి రామ్ దాసు పట్టణ కార్యదర్శి నజీర్ మహ్మదా మండల సహాయ కార్యదర్శి వెంకట్ రాముడు,శివ కు మార్ సీనియర్ నాయకులు గోపాల్ తదిరులు పాల్గొన్నారు.

# జ్యోతిలో ఘనంగా గంగమ్మ జాతర



సిద్దవటం - సూర్య వాస్తవం: సిద్దవటం మండలంలోని జ్యోతి గ్రామంలో ఆదివారం గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. జ్యోతి గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ జ్యోతి గంగమ్మ అమ్మవారి జాతర ఈనెల శనివారం ప్రారంభమయ్యింది. అమ్మవారిని నిలబెట్టుట, సాయంత్రం అమ్మవారి చరిత్ర కథ, ఊరేగింపును నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి యాటలను బలి ఇచ్చారు. రాత్రి కళాకారులచే కోలాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సీపీ రాజంపేట నియోజకవర్గం ఇంచార్జి అకేపాటి అనిల్ కుమార్ రెడ్డి, స్థానిక వైఎస్ఆర్సీపీ నాయకులు పిన్నపురెడ్డి రవి శంకర్ రెడ్డి, జ్యోతి శివారెడ్డి, రాజా భార్గవ్ రెడ్డి గృహాలకు విచ్చేసి జాతర శుభాకాంక్షలు తెలిపి విందు భోజనాన్ని ఆలకించారు.

**నేడు జ్యోతిలో బండలాగుడు పోటీలు**

గంగమ్మ జాతర సందర్భంగా సోమవారం వృషభ రాజములచే బండలాగుడు లాగుడు పోటీలను నిర్వహించనున్నారు. మొదటి బహుమతి 1,00,116, రెండవ బహుమతి 70,116, విరాళ దాతలు విన్నపురెడ్డి రవిశంకర్ రెడ్డి, జ్యోతి శివారెడ్డి, పిన్నపురెడ్డి రాజా భార్గవ్ రెడ్డి, 3వ బహుమతి 45,116, విరాళ దాతలు పిన్నపురెడ్డి చెన్నారెడ్డి, పిన్నపురెడ్డి రామమూర్తి రెడ్డి, 4వ బహుమతి 25,116, విరాళ దాతలు చిన్న వెంకటసుబ్బారెడ్డి, 5వ బహుమతి 15,116, బోవిళ్ళ నరేష్ రెడ్డి, శివ శంకర్ రెడ్డి బహుమతులు ఇవ్వనున్నారు. భక్తి, భావ్యత, సంప్రదాయ సమ్మేళనంగా జరిగే అమ్మవారి జాతరకు గ్రామస్తులు మండల వాసులు ప్రతి ఒక్కరూ పాల్గొని అమ్మవారి జాతర మహోత్సవాన్ని జయప్రదం చేశారు. వచ్చిన భక్తులకు అన్నదాన ప్రసాదాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. గంగమ్మ జాతర మహోత్సవానికి అతిధ్యం ఇచ్చిన వారి ఇంటికి వైసీపీ, టీడీపీ నాయకులు హాజరై వారి ఆతిధ్యాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసి శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు ఉపాసి వెంకట రమణా రెడ్డి, పిన్నపురెడ్డి చెన్నకేశవ రెడ్డి, కడపాయపల్లి శివారెడ్డి, వలీ చాన్, బత్తల భక్తుడు తదితరులు పాల్గొన్నారు.

## నారీ శక్తితో నవభారత నిర్మిస్తున్న మోడీ ప్రభుత్వం

### భా.జ.పా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్



**వేంపల్లె - సూర్య వాస్తవం:** నారీ శక్తితో నవ భారతాన్ని నిర్మిస్తున్న మోడీ ప్రభుత్వం అని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం వేంపల్లి లో ఆయన మాట్లాడుతూ సమాజంలో సగభాగమైన మహిళలు చట్ట సభల్లో కీలక పాత్ర పోషించినప్పుడే రాష్ట్ర దేశ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు కేంద్ర ప్రభుత్వం నారీ శక్తి అధినియం ద్వారా మహిళా రిజర్వేషన్లను కల్పించడం జరుగుతుందని చెప్పారు దశాబ్దాలుగా అందని ద్రాక్షలా ఉన్న 33 % మహిళా రిజర్వేషన్ల కలను మోదీ ప్రభుత్వం సాకారం చేస్తోందని ఆయన తెలిపారు. రానున్న రెండు మూడు రోజుల్లో ప్రత్యేక పార్లమెంట్ సమావేశపరిచి మహిళా రిజర్వేషన్ల బిల్లును పాస్ చేయడం జరుగుతుందని అన్నారు. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా దేశాభివృద్ధిలో నారీ శక్తిని అగ్రస్థానంలో నిలబెట్టడమే ఈ బిల్లు యొక్క లక్ష్యం అని చెప్పారు.

## జిల్లాలో క్రికెట్ బెట్టింగ్ లపై ప్రత్యేక నిఘా...

### బెట్టింగ్ లకు పాల్పడితే

# చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు

## - జిల్లా ఎస్పీ పి.జగదీష్



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌ల నేపథ్యంలో జిల్లా ఎస్పీ పి. జగదీష్ క్రికెట్ బెట్టింగ్‌లపై హెచ్చరికలు జారీ చేశారు. ఐపీఎల్‌ను ఆసరాగా తీసుకుని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రూపాల్లో విస్తరించకుండా బెట్టింగ్ ముఠాలను పూర్తిగా అణచివేయడానికి జిల్లా పోలీస్ శాఖ సమగ్ర చర్యలు చేపట్టిందన్నారు. సులభంగా డబ్బు వస్తుందనే మాయలో పడితే అది కేవలం నష్టం మాత్రమే కాదు---వ్యక్తిగత జీవితం, కుటుంబ స్థిరత్వం, భవిష్యత్తు అవకాశాలన్నీ ప్రమాదంలో పడతాయని స్పష్టం చేశారు. బెట్టింగ్ వ్యసనం అప్పులు, బెదిరింపులు, మానసిక ఒత్తిడి, నేర సంబంధాలకు దారి తీస్తుందని హెచ్చరించారు.

**హైటెక్ నిఘా -- బెట్టింగ్ నెట్‌వర్క్‌లపై డిజిటల్ వార్**

జిల్లాలో అక్రమ క్రికెట్ బెట్టింగ్‌ను అరికట్టేందుకు పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నమన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లు, డార్క్ వెబ్ కార్యకలాపాలపై సైబర్ బృందాలు నిరంతర నిఘా నిర్వహిస్తున్నాయని బాల్-టు-బాల్ బెట్టింగ్ జరిగే ప్లాట్‌ఫార్మ్‌లలో ట్రాన్సాక్షన్ ప్యాటర్న్‌లను విశ్లేషించి అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తిస్తున్నామన్నరూ. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ వంటి ప్లాట్‌ఫార్మ్‌లలో బెట్టింగ్ ప్రచారాలను ట్రాక్ చేసి చర్యలు తీసుకుంటామని అనుమానాస్పద ప్రదేశాలు, హాట్‌స్పాట్‌లలో సీసీటీవీ ఫుటేజ్ విశ్లేషణతో పాటు గ్రౌండ్ లెవెల్ ఇన్ఫార్మేషన్ సేకరణ చేస్తామన్నారు.

**క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు :**

క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొన్నా, నిర్వహించినా, ప్రోత్సహించినా ఆంధ్రప్రదేశ్ జూద చట్టం ప్రకారం... క్రిమినల్ కేసులు నమోదు, అరెస్టులు, సస్పెక్ట్ షీట్లు ఓపెన్, బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్, డిజిటల్ పరికరాల స్వాధీనంతో పాటు భవిష్యత్తులో ఉద్యోగాలు, విదేశీ అవకాశాలు కోల్పోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలతో నిరంతర తనిఖీలు కొనసాగుతున్నాయని, ఎవరైనా అక్రమంగా బెట్టింగ్ నిర్వహించినా ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ



పిల్లలపై కచ్చితమైన పర్యవేక్షణ ఉంచాలని, యువత తమ భవిష్యత్తును కాపాడుకునేలా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించారు.

**ప్రజలకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి :**

మీ పరిసరాల్లో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు గమనించినా, ఆన్‌లైన్ ద్వారా జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు.

### ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

# కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే



**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ , ఛైర్పర్సన్ , రోఖియా బేగం లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులుడ ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్. నల్లపాటి తిరుపతినాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని. వాసవి కల్యాణ మండపం (అమ్మవారు శాల )నందు ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి సంస్థ వారు ఉచిత మెగా కంటి వైద్య శి బి రా న్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు, కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ అలీషా . మాట్లాడుతూ - కంటి పట్ల నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచనలు ఇచ్చారు. కంటి వ్యాధి రకాలు,ముందు జాగ్రత్త చర్యలు,నివారణ చర్యలను తెలియజేశారు. ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ కంటిచూపు బాగుండడం ద్వారానే ఎవరికి వారు తమ పనులు సులువుగా చేసుకోగలరని కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే అన్నారు. సృష్టిలో అనేక అద్భుతాలు ఉన్నాయి వాటన్నిటిని చూసి తరించడంలో కళ్ళు ముఖ్య పాత్ర పోషిస్తాయి అన్నారు. డాక్టర్ అలీషా . కంటిచూపు మందగించిన 240మందిని పరీక్షించి 104. మందిని ఆపరేషన్ కు రేపర్ చేశారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు 100 మొక్కలను ప్రజలకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కె . రఘువీర్ రావు జిల్లా చైర్పర్సన్, డాక్టర్ టీ . మురళి కృష్ణ . డాక్టర్ శాంతిప్రియ . పిసే జయరాం రావు, ప్రధాన కార్యదర్శి పట్రా శ్రీనివాసులు, ఉప కార్యదర్శి ముండే షేక్షావలి, కోశాధికారి డి షేక్షావలి, క్లబ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పట్రా నరేష్ కుమార్, క?బ్ నిర్వాహకుడు ఆర్.ఎం.పి గశీగ శేకర్ డైరెక్టర్స్ అమర్నాథ్ రెడ్డి . రాకేష్ . ఎం నాగరాజు , అంజి నాయక్, శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు ఆర్గనైజర్ రాకేష్, బెంగళూరు కంటి ఆసుపత్రి సిబ్బంది. డ. లక్ష్మి హాస్పిటల్ సిబ్బంది మానవ హక్కుల సంఘం సౌత్ ఇండియా కార్యదర్శి ఆవుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సమాజ నిర్మాణానికి కృషి

### ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

### మరిన్ని సేవలందించేందుకు తోడ్పాటు అందిస్తాం





**వేంపల్లె - సూర్య వాస్తవం:**

ఉత్తమ సమాజ నిర్మాణానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ మండల శాఖ ఛైర్మన్ బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు డా.యోగీశ్వర్ బాబు లు వెల్లడించారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో మానవత సంస్థ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ప్రముఖ వైద్య నిపుణులు డా.శివకృష్ణ, డా.అపర్ణ లతో పాటు అరవింద్ కంటి ఆసుపత్రి వైద్యులు, వివిధ రకాల సాధారణ వైద్య సేవలతో పాటు కంటి సంబంధిత సమస్యలపై వైద్య సేవలను అందించారు. మానవత సంస్థ ఛైర్మన్ బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు డా.యోగీశ్వర్ బాబు, మానవత కుటుంబ సభ్యులు, విద్యార్థి వాలంటీర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేశారు. వేంపల్లె మండలం, చుట్టు ఉన్న గ్రామాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగ పరుచుకున్నారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి, డా.యోగీశ్వర్ బాబు లు మాట్లాడుతూ గడిచిన కొన్ని దశాబ్దాల కాలం నుంచి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వివిధ అనేక రకాల సేవలు అందిస్తున్నామని వివరించారు. ఉత్తమ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మున్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు దాతలు కూడా ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మానవత కుటుంబ సభ్యులు కావలి క్రిష్ణతేజ, డాక్టర్ రంగయ్య, డా.రాజారాం, రామమునిరెడ్డి, తేజ, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

### నందిపల్లి నందీశ్వర ఆలయాన్ని దర్శించిన తులసి రెడ్డి





**వేంపల్లె - సూర్య వాస్తవం:** పులివెందుల నియోజకవర్గం, వేంపల్లె మండలం,నంది పల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన నందీశ్వరాలయాన్ని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి దర్శించారు. ఆలయ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ఆలయ నిర్వహకులు రామాంజనేయరెడ్డి తులసి రెడ్డిని శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన, ఆధ్యాత్మిక వాతావరణం లో నందీశ్వరాలయం నిర్మించబడిందని, అశాంతితో అల్లాడుతున్న ఆధునిక సమాజానికి నంది పల్లి నందీశ్వరాలయం లాంటి ఆధ్యాత్మిక క్షేత్రాలు ఎంతోఅవసరం అని అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు కరిమి రెడ్డి అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, ఐచర్ రమణ, నామా వినయ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అనాధవృద్ధులకు అన్నదానం

### జనసేన నేత పోతిరెడ్డి చలపతి



**వేంపల్లె - సూర్య వాస్తవం:** స్థానిక మధర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ వృధ్ధాశ్రమంలో అనాధవృధ్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మాజీ సర్పంచ్, జనసేన నేత పోతిరెడ్డి చలపతి వెల్లడించారు. ఆదివారం పోతిరెడ్డి నారాయణ పదో వర్ధంతి సందర్భంగా వృధ్ధులకు అన్నదానం, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం చలపతి మాట్లాడుతూ తన తండ్రి నారాయణ పదో వర్ధంతిని పురస్కరించుకుని ఆశ్రమంలోని అనాధ వృధ్ధుల మధ్య ఈ వేడుకను చేపట్టామన్నారు. అలాగే సమాజంలో ఉన్న నిస్సహాయకులకు తోడ్పాటు అందించేందుకు ప్రతి ఒక్కరూ దోహద పడలన్నారు. ఈ కార్యక్రమంలో పోతిరెడ్డి నిఖిలేంద్ర రాయల్, సూర్య నారాయణ, కొండయ్య, వలి, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా స్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కోట్ల



**విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలి**



**డోన్ -సూర్య వాస్తవం:** డోన్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం క్రీడా భారతి ఆధ్వర్యంలో అండర్-14 జిల్లా స్థాయి బాలబాలికల కబడ్డీ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, కబడ్డీ వంటి దేశీయ క్రీడలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ధైర్యం, సహనాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అధైర్య పడవద్దు అన్ని విధాల అండగా ఉంటాం

### వివిధ కార్యక్రమాలలో జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



**వేముల - సూర్య వాస్తవం** వేముల మండల పరిధిలో వేముల వైకాపా మండల కన్వీనర్ సాంబశివారెడ్డి తో కలిసి వైకాపా నాయకులను పరామర్శించి అధైర్య పడవద్దని అన్ని విధాల అండగా ఉంటామని భరోసా కల్పించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమాల్లో భాగంగాఆదివారం జిల్లావ్యాప్తంగా జరిగినటువంటి పలు శుభకార్యాలలో మరియు పరామర్శల కార్యక్రమాలలో జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో భాగంగా జిల్లాలో పలువురు నేతల ఆహ్వానం మేరకు వివాహ శుభకార్యాలలో అవినాష్ రెడ్డి పాల్గొని ఆత్మీయులను పేరుపేరునా పలకరిస్తూ నూతన వధూవరులకు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమాలలో కుటుంబ పెద్దలు మరియు నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పరామర్శ

### మాజీ సర్పంచ్ యోగక్షేమాలపై ఆరా



**వేంపల్లె సూర్య వాస్తవం:** కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాయవరం.రామలింగయ్యని పరామర్శించారు. ఆదివారం వేంపల్లెలోని రామలింగయ్య స్వగృహానికి ఎంపి చేరుకుని, యోగక్షేమాలపై ఆరాతీసారు. ధైర్యంగా ఉండాలని, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ఏ అవసరమైన తన దృష్టికి తేవాలని కోరారు. మాజీ సర్పంచ్ రామలింగయ్య విశిష్టమైన సేవలు అందించారని ఎంపి గుర్తు చేశారు. అనంతరం వేంపల్లిలోని మధు రెడ్డి కన్వెన్షన్ కళ్యాణ మండపంలో చక్రాయపేట మండలానికి చెందిన మూలం రెడ్డి యోగాంజనేయరెడ్డి, సునీత దంపతుల కుమార్తె శ్వేత, సాయి చరణ్ రెడ్డి ల వివాహం జరిగింది. కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు మడక రామాంజనేయరెడ్డి, శివ కేశవరెడ్డి, రమణారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

## ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అంకాలమ్మ తల్లి

**పులివెందుల - సూర్య వాస్తవం:**



పులివెందల పట్టణం పార్నపల్లి రోడ్డు సమీపంలో నడిబొడ్డున కొలువై ఉన్న అంకాలమ్మ తల్లికి ఆదివారం పర్వదినాన ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయాస్తమాన అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, కుంకుమార్చన, తదితర పూజా కైకర్యాల అనంతరం పట్టు వస్త్రాలతో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు అందుకొని మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని, ప్రతి ఆదివారం ఆలయానికి వస్తున్నటువంటి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేస్తూ జాగ్రత్తలు వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వహణ ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు ఎండోమెంట్ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణానికి కృషి.

### ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

## మరిన్ని సేవలందించేందుకు తోడ్పాటు అందిస్తాం

**వేంపల్లె - సూర్య వాస్తవం:** ఉత్తమ సమాజ నిర్మాణానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ మండల శాఖ ఛైర్మన్ బంద్రెడ్డి చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు డా.యోగీశ్వర్ బాబు లు వెల్లడించారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో మానవత సంస్థ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ప్రముఖ వైద్య నిపుణులు డా.శివకృష్ణ, డా.అపర్ణ లతో పాటు అరవింద్ కంటి ఆసుపత్రి వైద్యులు, వివిధ రకాల సాధారణ వైద్య సేవలతో పాటు కంటి సంబంధిత సమస్యలపై వైద్య సేవలను అందించారు. మానవత సంస్థ ఛైర్మన్ బంద్రెడ్డి చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు డా.యోగీశ్వర్ బాబు, మానవత కుటుంబ సభ్యులు, విధ్యార్థి వాలంటీర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేశారు. వేంపల్లె మండలం, చుట్టు ఉన్న గ్రామాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగ పరుచుకున్నారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా బంద్రెడ్డి చక్రపాణిరెడ్డి, డా.యోగీశ్వర్ బాబు లు మాట్లాడుతూ గడిచిన కొన్ని దశాబ్దాల కాలం నుంచి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వివిధ అనేక రకాల సేవలు అందిస్తున్నామని వివరించారు. ఉత్తమ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ముమ్మందు మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు దాతలు కూడా ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మానవత కుటుంబ సభ్యులు కావలి క్రిష్ణతేజ, డాక్టర్ రంగయ్య, డా.రాజారాం, రామమునిరెడ్డి, తేజ, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో దుప్పి మృతి

**అన్నమయ్య - బ్యూరో సూర్య వాస్తవం:** వీరబల్లి మండలం గడికోట గ్రామం పెద్దూర్లో కొండపై నుంచి నీటి కోసం దిగిన దుప్పిపై కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందింది. ఘటనను గమనించిన గ్రామస్థులు ఫారెస్ట్ బీట్ అధికారికి సమాచారం అందించారు. అనంతరం పశు వైద్యుడు డా. గణేష్ సిబ్బందితో చేరుకుని చికిత్స అందించినప్పటికీ, గాయాలు తీవ్రంగా ఉండటంతో దుప్పి ప్రాణాలు కోల్పోయింది.



# అర్ధరాత్రి జిల్లా ఎస్పీ గస్తీ....!



- ఆపరేషన్ నైట్ సేఫ్టీ"లో భాగంగా రాత్రి వేళల్లో అకస్మిక తనిఖీలు
- మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు
- మందుబాబులపై కొరడా ఝుళిపిస్తున్నా జిల్లా పోలీసులు







**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :**

అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్ స్వయంగా రాత్రి గస్తీని పర్యవేక్షిస్తూ, అసాంఘి క కార్యకలాపాలను అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆపరేషన్ నైట్ సేఫ్టీ" లో భాగంగా, రాత్రి వేళల్లో అకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు, కేసులు నమోదు చేస్తున్నారు. మైనర్ డ్రైవింగ్ నిరోధానికి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కూడా పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. రాత్రి 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రధాన జంక్షన్లు, పట్టణాల్లో విస్తృత తనిఖీలు చేపడుతున్నరు. ఈ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టం గురించి వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. యువతకు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించారు.రాత్రి సమయంలో అనవసరంగా సంచరిస్తున్న వ్యక్తులను ఆపి విచారించారు. ప్రజల భద్రత దృష్ట్యా వారి వివరాలు నమోదు చేసి జాగ్రత్తలు సూచించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.ప్రజలు భయపడకుండా సురక్షితంగా సంచరించేలా కట్టుదిట్టమైన భద్రతా చర్యలపై ఆదేశాలు... అర్ధరాత్రి అవసరం ఉన్న వారు మాత్రమే బయట రాకపోకలు జరపాలని సూచన చేశారు.జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా...పెట్రోలింగ్ వాహనాల నిరంతర సంచారం కొనసాగించాలని ఆదేశాలు జారీ చేశారు.ప్రతి కీలక ప్రాంతంలో బీట్ కానిస్టేబుళ్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు మహిళల భద్రతకు ప్రాధాన్యత... బందోబస్తు పోలీసులు రాత్రి వేళల్లో చురుకుగా పనిచేయాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ప్రత్యక్షంగా సీసీటీవీ కెమెరాల పనితీరు పరిశీలన...లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కఠినంగా నిర్వహించాలని... అనవసరంగా తిరగాడే యువకుల తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ చేయాలని పేర్కొన్నరు.నగరంలో నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెంపు లక్ష్యంగా రాత్రి వేళ భద్రత కోసం ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాల ని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రూసో ఆధ్వర్యంలో నిరసన




**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురంలోని పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం కె.ఎస్.ఆర్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాల యునైటెడ్ ఆర్గనైజేషన్ (రూసో)జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీపీఎస్ హెచ్.ఎంల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీ.ఆర్.సీ కమిటీని వేసి, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. పీ.ఆర్.సీ గడువు ముగిసి మూడేళ్లు దగ్గర పడుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. ఎన్.టీ.ఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి జయరాం నాయక్, రవీంద్ర బాబు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే ప్రకటించాలని కోరారు. ఆకాశాన్నంటుతున్న ధరలు నియంత్రంచ లేనప్పుడు డీఏలు ఎప్పటికప్పుడు మంజూరు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. మధ్యతరగతి ఉద్యోగుల జీవన భద్రతకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గిరిజన ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి దేగవత్ రవి మాట్లాడుతూ సీపీఎస్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి ఓపీఎస్ వర్తింపచేయాలని కోరారు. పెన్షన్ ఉద్యోగి హక్కని తెలిపారు. దీన్ని హరించవద్దని విజ్ఞప్తి చేశారు. టెట్ నుంచి ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, పీఎస్ హెచ్ఎం లకు బదిలీల కంటే ముందే సర్దుబాటు చేయాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయు లకు సకాలంలో వేతనాలు చెల్లించి, పదవి విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షుడు శివశంకర్ రెడ్డి, శర్మా వలి, రామ్మూర్తి నరేంద్రనాథ్, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్

## రిజర్వాయర్ కుడి కాలువ నీటి సరఫరా నిలిపివేత

**ఉరవకొండ - సూర్య వాస్తవం:** 132 రోజుల నిరంతర ప్రవాహం తర్వాత, పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కుడి కాలువకు నీటి సరఫరాను అధికారికంగా నిలిపివేశారు.

ఇంజనీరింగ్ బృందం 13 రోజుల పాటు తీవ్రంగా శ్రమించి కాలువ గేటును కిందకు దించగలిగారు.?హెచ్ఎల్సి ఎస్ఇ సుధాకర్ రావు, ఈఈ ఎం. కవిత, మరియు డిఈ ఓబిరెడ్డి ఈ ఆపరేషన్ను పర్యవేక్షించారు.?నీటి ప్రవాహాన్ని ప్రారంభించడానికి మొదట గేటును ఎత్తడానికి ఎంత కష్టపడ్డారో, దానిని మూసివేసేటప్పుడు కూడా అంతే స్థాయి ఇబ్బందులు ఎదురయ్యాయని అధికారులు పేర్కొన్నారు. నీటి విడుదల డిసెంబర్ 1, 2025న ప్రారంభమై, 132 రోజుల పాటు కొనసాగింది. ఈ కాలంలో మొత్తం 4.5 టీఎంసీల నీటిని సరఫరా చేశారు. అనంతపురం మరియు సత్యసాయి జిల్లాల్లోని సుమారు 48 చెరువులు 30% నుండి 80% వరకు



నిండాయి.?ప్రస్తుత తాగునీటి పరిస్థితి?కాలువ మూసివేసినప్పటికీ, రాబోయే నెలల్లో తాగునీటికి ఎటువంటి కొరత ఉండదని అధికారులు భరోసా ఇచ్చారు.?ప్రస్తుత నిల్వ: రిజర్వాయర్లో ప్రస్తుతం 2.623 టీఎంసీల నీరు ఉంది.ఈ నిల్వ జూలై 2026 వరకు తాగునీటి అవసరాలకు సరిపోతుందని అంచనా వేస్తున్నారు. ఈ క్రింది ప్రాంతాలకు రోజువారీ సుమారు 50 క్యూసెక్కుల చొప్పున నిరంతరాయంగా తాగునీటి సరఫరా కొనసాగుతుంది:అనంతపురం నగరం, ఉరవకొండ,హిందూపురం,మడకశిరకళ్యాణదుర్గం

## స్పీడ్ పెంచిన
# కయాదు లోహార్.. లైనప్ అదుర్స్!




2021లోనే తన కెరియర్ ను మొదలుపెట్టిన కాయాదు లోహార్ 2025లో వచ్చిన డ్రాగన్ సినిమాతో లైమ్ లైట్ లోకి వచ్చింది. ఈ మధ్యకాలంలో హీరోయిన్స్ భాషతో సంబంధం లేకుండా.. వివిధ భాషలలో వరుస అవకాశాలు అందుకుంటూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా భాషతో పట్టింపు లేకుండా కంటెంట్ ఉంటే చాలు ప్రేక్షకులు ఆదరిస్తున్న సమయంలో అటు సెలబ్రిటీలు కూడా మంచి ఓరియెంటెడ్ కథలతో పాన్ ఇండియా స్టేటస్ ను సొంతం చేసుకుంటూ ఉండడం గమనార్హం. ఈ క్రమంలోనే మోడల్ గా తన కెరీర్ ను మొదలుపెట్టి.. ఆ తర్వాత కన్నడ చిత్రం ద్వారా ప్రేక్షకులకు పరిచయమై ఇప్పుడు వరుస సినిమాలతో బిజీగా మారింది కాయాదు లోహార్. 2021 లోనే తన కెరియర్ ను మొదలుపెట్టిన కాయాదు లోహార్ 2025లో వచ్చిన డ్రాగన్ సినిమాతో లైమ్ లైట్ లోకి వచ్చింది .

అంటే తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకోవడానికి సుమారుగా నాలుగు సంవత్సరాల సమయం పట్టింది అనడంలో సందేహం లేదు. అయితే అలా తక్కువ సమయంలోనే పాపులారిటీ సొంతం చేసుకున్న ఈమె ఇప్పుడు పల్లి చట్టంబి అనే మలయాళం చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. టోవినో థామస్, కాయాదు లోహార్ జంటగా డిజోజోస్ ఆంటోనీ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఏప్రిల్ 10వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇక ఈ సినిమా ఇప్పుడు మంచి సక్సెస్ అందుకోవడంతో ఈమె తదుపరి సినిమాల జాబితా సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. వరుస సినిమాలతో బిజీగా మారిన కాయాదు లోహార్.. ఈ మధ్యకాలంలో ఆకట్టుకునే వైవిధ్యభరితమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఈమె.. అందులో భాగంగానే దుల్కర్ సల్మాన్ తో ఐ యామ్ గేమ్ , నానితో ది ప్యారడైజ్, జీవి ప్రకాష్ కుమార్ తో ఇమ్మోర్టల్ , అధర్వతో ఇదయం మురళి, నివిన్ పౌలీ తారం తో పాటు ఎస్టీఆర్ 49 చిత్రాలు కూడా ఈమె చేతిలో ఉన్నాయి ..ఇక ఇప్పుడు ఇలా వరుస సినిమాలతో తెలుగు, తమిళ్, మలయాళం భాషలలో వరుస అవకాశాలు అందుకుంటూ బిజీగా మారిపోయింది. ఒకవేళ ఈ సినిమాలు గనుక మంచి సక్సెస్ అందుకున్నాయి అంటే సౌత్ సినీ పరిశ్రమలో అత్యంత డిమాండ్ ఉన్న నటీమణులలో ఒకరిగా ఈమె పేరు సొంతం చేసుకుంటుంది. ఏది ఏమైనా కాయాదు లోహార్ ప్రాజెక్టులు చాలా భారీగానే ఉన్నాయి. మరి ఈ సినిమాలతో ఆమె తనను తాను ఎలా మార్చుకుంటుందో చూడాలి.

కాయాదు లోహార్ కెరియర్.. 2000 ఏప్రిల్ 11వ తేదీన అస్సాం తేజ్ పూర్ లో జన్మించిన ఈమె మోడల్ గా తన కెరీర్ ను మొదలుపెట్టి.. 2021లో పూణే ఫ్రెష్ ఫేస్ కాంపిటీషన్ విజేతగా నిలిచింది. అప్పుడే కన్నడ చిత్రం మొగిల్ పేటలో తొలిసారి అవకాశం లభించి నటిగా ఇండస్ట్రీకి పరిచయం అయింది. తెలుగులో అల్లూరి అనే చిత్రం ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈమె ఫంకీ అనే మరో తెలుగు చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.

## మధుర గాయని ఆశా భోంస్లేకు
## ప్రముఖుల సంతాపం



**అమరావతి :** ప్రముఖ దిగ్గజ గాయని ఆశా భోంస్లే (92) ఆదివారం కన్నుమూశారు. ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ సందర్భంగా సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.'ఆశా భోంస్లే మరణ వార్త విని దిగ్భ్రాంతికి గురయ్యాను. దశాబ్దాల పాటు సాగిన ఆమె సంగీత ప్రస్థానం.. ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది అభిమానుల హృదయాలను గెలుచుకుంది. ఆమె కుటుంబ సభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. ఆశా భోంస్లే జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం. ఆమె పాటలు ప్రజల జీవితాల్లో శాశ్వతంగా నిలిచి ఉంటాయి'

-- ప్రధాని నరేంద్ర మోడి

'ఆశా భోంస్లే మరణవార్త విని తీవ్రంగా దు్ఖిస్తున్నా. ఆమె మధురమైన స్వరం దశాబ్దాల పాటు భారతీయ సినిమాకు ప్రాణంగా నిలిచి, లక్షలాది హృదయాలను తాకింది. తరతరాలు నిలిచిపోయే జ్ఞాపకాలను వదిలివెళ్లారు. ప్రేమ, గౌరవంతో ఆమెను ఎప్పుడూ గుర్తుచేసుకుంటూనే ఉంటాం. ఆమె కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి.

ఓం శాంతి' -- ఎన్టీఆర్

"గొప్ప గాయని ఆశా భోంస్లే మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. తరతరాలుగా తన పాటతో ఎంతోమంది హృఅదయాలను మంత్రముగ్ధులను చేసిన గాయని. ఎన్నో బెంగాలీ పాటలను కూడా ఆమె పాడారు. 2018లో రాష్ట్ర అత్యున్నత పౌర పురస్కారం 'బంగ బిభూషణ్'ను ఆమెకు ప్రదానం చేశాం. ఆమె కుటుంబం, అభిమానులు, మొత్తం సంగీత పరిశ్రమకు నా సానుభూతి వ్యక్తం చేస్తున్నా"

-- మమతా బెనర్జీ

'ఆశా భోంస్లే గొప్పతనాన్ని వర్ణించడానికి నేను చెప్పే మాటలు ఏవైనా సరిపోతాయా? ఆమె సాధించలేనిది అసలు ఏదైనా ఉందా? నిజమైన మార్గదర్శి. ఒక పనిని ఎలా సాధించాలో మా అందరికీ చేసి చూపించారు'

-- చిన్మయి శ్రీపాద

'భారతీయ సంగీత ప్రపంచంలో ఒక గొప్ప కంఠం ఈరోజు మూగబోయింది. ఆమె తన పాటలతో తరతరాలకు ఆనందాన్ని పంచారు. లెక్కలేనన్నీ భావోద్వేగాలను స్పృశించారు. లతా దీదీ తర్వాత సంగీత పరిశ్రమలో ఒక గొప్ప శకానికి మూల స్తంభంలా నిలిచారు. ఆమె మరణంతో నేడు అది కూలిపోయింది

'- శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే



# టైటాన్స్ అలవోకగా..

- సూపర్‌జెయింట్స్‌పై 7 వికెట్లతో గెలుపు
- పేసర్ ప్రసిద్ కృష్ణ 4 వికెట్ల ప్రదర్శన
- లక్నో 164/8, గుజరాత్ 165/3

**ప్రసిద్ కృష్ణ (4/28) నిప్పులు చెరిగే ప్రదర్శన కనబరచగా.. లక్నో సూపర్‌జెయింట్స్‌పై గుజరాత్ టైటాన్స్ 7 వికెట్ల తేడాతో అలవోక విజయం సాధించింది. జోశ్ బట్లర్ (60), శుభ్‌మన్ గిల్ (56) అర్ధ సెంచరీలు సాధించడంతో గుజరాత్ టైటాన్స్ 18.4 ఓవర్లలోనే సీజన్లో రెండో విజయం ఖాతాలో వేసుకుంది. సొంతగడ్డపై లక్నో సూపర్‌జెయింట్స్ బ్యాటర్లు సమిష్టిగా నిరాశపరిచారు.**



**లక్నో :** గుజరాత్ టైటాన్స్ మురిసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (56, 40 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), జోశ్ బట్లర్ (60, 37 బంతుల్లో 11 ఫోర్లు) అర్ధ సెంచరీలతో రాణించటంతో 165 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ టైటాన్స్ 18.4 ఓవర్లలోనే ముగించింది. లక్నో సూపర్‌జెయింట్స్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఛేదనలో శుభ్‌మన్ గిల్, జోశ్ బట్లర్ మెరవటంతో సూపర్‌జెయింట్స్ బౌలర్లు తేలిపోయారు. తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్‌జెయింట్స్ 20 ఓవర్లలో8 వికెట్లకు 164 పరుగులు చేసింది. టైటాన్స్ పేసర్ ప్రసిద్ కృష్ణ (4/28), అశోక్ శర్మ (2/32) రాణించారు. ఓపెనర్ ఎడెన్ మార్‌క్రామ్ (30, 21 బంతుల్లో 21 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), రిషబ్ పంత్ (18, 11 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) మంచి ఆరంభాలను సద్వినియోగం చేసుకోలేదు. నాలుగు వికెట్లతో మెరిసిన ప్రసిద్ కృష్ణ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. సీజన్లో 4 మ్యాచ్‌ల్లో టైటాన్స్‌కు ఇది రెండో విజయం కాగా, సూపర్‌జెయింట్స్‌కు 4 మ్యాచ్‌ల్లో రెండో ఓటమి.

ఆడుతూ పాడుతూ : 165 పరుగుల లక్ష్యాన్ని టైటాన్స్ ఆడుతూ పాడుతూ ఛేదించింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (15) పవర్‌ప్లేలోనే వికెట్ కోల్పోయాడు. శుభ్‌మన్ గిల్ (56), జోశ్ బట్లర్ (60) రెండో వికెట్‌కు గెలుపు భాగస్వామ్యం నమోదు చేశారు. 6 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 34 బంతుల్లో శుభ్‌మన్ గిల్ అర్ధ సెంచరీ సాధించాడు. పవర్‌ప్లేలో గిల్ యాంకర్ పాత్ర పోషించగా, బట్లర్ దూకుడుగా ఆడాడు. 9 ఫోర్లతో 29 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన జోశ్ బట్లర్.. సాధించాల్సిన రన్‌రేట్‌ను అదుపులో పెట్టాడు. దీంతో టైటాన్స్ బ్యాటర్లు ఏ ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా పరుగులు రాబట్టారు. అర్ధ సెంచరీల తర్వాత గిల్, బట్లర్ నిష్క్రమించినా.. వాషింగ్టన్ సుందర్ (21 నాటౌట్, 13 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), రాహుల్ తెవాటియ (10 నాటౌట్, 8 బంతుల్లో 1 ఫోర్) నాల్గో వికెట్‌కు అజేయ భాగస్వామ్యం జోడించారు. మరో 8 బంతులు ఉండగానే టైటాన్స్ 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. సూపర్‌జెయింట్స్ బౌలర్లలో మహ్మద్ షమి (1/36), ప్రిన్స్ యాదవ్ (1/31), దిగ్వేశ్ (1/31) రాణించారు.

ప్రసిద్ కృష్ణ విజృంభణ : సొంత మైదానంలో తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన సూపర్‌జెయింట్స్ ఆశించిన స్కోరు చేయలేదు. టైటాన్స్ పేసర్ ప్రసిద్ కృష్ణ, అశోక్ వర్మలు వికెట్ల వేటలో విజృంభించారు. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన సూపర్‌జెయింట్స్ ఏ దశలోనూ టైటాన్స్ బౌలర్లపై ఎదురుదాడి చేయలేదు. ఓపెనర్ ఎడెన్ మార్‌క్రామ్ (30) ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేసినా.. ఆ దిశగా విఫలం అయ్యాడు. మిచెల్ మార్ష్ (11), ఆయుశ్ బదోని (9), నికోలస్ పూరన్ (19), అబ్దుల్ సమద్ (18), ముకుల్ చౌదరి (18), సహా కెప్టెన్ రిషబ్ పంత్ (18) ఒత్తిడిలో పరుగులు చేయటంలో నిరాశపరిచారు. పరుగుల పొదుపుతో బ్యాటర్లపై ఒత్తిడి పెంచిన టైటాన్స్ పేసర్లు.. అదే జోరులో వికెట్లు పడగొట్టారు. 20 ఓవర్లలో 8 వికెట్లకు సూపర్‌జెయింట్స్ 164 పరుగులే చేసింది.

సంక్షిప్త స్కోరు వివరాలు :

లక్నో సూపర్‌జెయింట్స్ : 164/8 (ఎడెన్ మార్‌క్రామ్ 30, నికోలస్ పూరన్ 19, రిషబ్ పంత్ 18, ప్రసిద్ కృష్ణ 4/28, అశోక్ శర్మ 2/32)

గుజరాత్ టైటాన్స్ : 165/3 (జోశ్ బట్లర్ 60, శుభ్‌మన్ గిల్ 56, వాషింగ్టన్ సుందర్ 21, ప్రిన్స్ యాదవ్ 1/31, మహ్మద్ షమి 1/36)

## సాల్ట్, పాటిదార్ విధ్వంసం

- ముంబైపై ఆర్‌సిబి ఘనవిజయం
- రాణించిన సాల్ట్, కోహ్లి, పాటిదార్
- ముంబైకి హ్యాట్రిక్ ఓటమి

ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఉత్కంఠభరిత పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టీమ్ 18 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై అద్భుత విజయాన్ని అందుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ బ్యాటర్లు ముంబై బౌలర్లను దీటుగా ఎదుర్కొని నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 240 పరుగుల భారీ స్కోరును సాధించారు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ కేవలం 36 బంతుల్లోనే 78 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడగా, విరాట్ కోహ్లి (50) క్లాస్ ఆటతీరుతో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. వీరిద్దరూ కలిసి మొదటి వికెట్‌కు 120 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రజత్ పాటిదార్ కేవలం 20 బంతుల్లోనే 53 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు.

అనంతరం 241 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ చివరి వరకు పోరాడి 222 పరుగులు చేయగలిగింది. ముంబై ఇన్నింగ్స్‌లో చివర్లో షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (71 నాటౌట్) ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు కొట్టినంత పని చేసినా, లక్ష్యం పెద్దది కావడంతో విజయం ఆర్‌సీబీనే వరించింది. బెంగళూరు బౌలర్లలో సుయాశ్ శర్మ రెండు వికెట్లతో కీలక పాత్ర పోషించగా, కృనాల్ పాండ్యా కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ముంబైని కట్టడి చేశాడు. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో ఆర్‌సీబీ తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకుంది.



